'నియామక ప్రక్రియ మధ్యలో అర్హతలు మార్చొద్దు'

న్యూఢిల్లీ, నవంబర్ 7: ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత, ప్రక్రియ మధ్యలో నియమాలు, అర్హతలు మార్చడానికి వీల్లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజస్థాన్ హైకోర్టులో అనువాదకుల ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన కేసులో 2023 జూలైలో జస్టిస్ ఆర్ఎం లోధా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ మనోజ్ మిశ్రతో కూడిన ధర్మాసనం ఈ కేసులో తీర్పును వెలువరించింది. నియామక ప్రక్రియ మధ్యలో అర్హతలను మార్చవచ్చా అనే న్యాయపరమైన ప్రశ్నకు ధర్మాసనం స్పష్టతనిచ్చింది. నియామక ప్రక్రియ మధ్యలో నియమాలను మార్చొద్దని కె.మంజుశ్రీ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో 2008లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. ఈ తీర్పు సరైనదేనని, హర్యానా ప్రభుత్వం వర్సెస్ సుభాష్ చందర్ మర్వహ కేసులో 1973లో ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకోలేదనే కారణంతో ఈ తీర్పును తప్పుగా భావించలేమని పేర్కొన్నది. నిబంధనలు అనుమతిస్తే తప్ప నియామక ప్రక్రియ మధ్యలో అర్హతకు సంబంధించిన నియమాలు మార్చడం కుదరదని ధర్మాసనం స్పష్టం చేసింది. దరఖాస్తులను ఆహ్వానించడంతో నియామక ప్రక్రియ మొదలవుతుందని, నియామకాలు పూర్తి చేయడంతో ముగుస్తుందని స్పష్టతనిచ్చింది. నియామకాలకు సంబంధించిన నియమాలు ఏకపక్షంగా ఉండొద్దని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని తెలిపింది.

'రాజీ పడినంత మాత్రాన లైంగిక వేధింపుల కేసు రద్దు కాదు'

న్యూఢిల్లీ, నవంబర్ 7: లైంగిక వేధింపులకు సంబంధించి సుప్రీం కోర్టు మరో కీలకమైన తీర్పునిచ్చింది. బాధితురాలు, నిందితుడు రాజీ పడినంత మాత్రాన లైంగిక వేధింపుల కేసు రద్దు కాదని స్పష్టం చేసింది. రాజస్థాన్‌లో విద్యార్థినిని లైంగికంగా వేధించారంటూ ఒక ఉపాధ్యాయునిపై నమోదైన కేసును నిందితుడు, బాధితురాలు రాజీ పడినందున కొట్టివేస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసింది. నిందితునిపై విచారణ కొనసాగాల్సిందేనని పేర్కొంది. రాజస్థాన్‌లోని గంగాపూర్ నగరంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న విమల్ కుమార్ గుప్తా ఒక దళిత బాలికను లైంగికంగా వేధించినట్టు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను కూడా నమోదు చేశారు. అయితే విచారణ సందర్భంగా బాధిత బాలిక తల్లిదండ్రులు స్టాంప్ పేపర్‌పై రాసిచ్చిన పత్రాన్ని నిందితుడు సమర్పించాడు. పొరపాటున తాము ఉపాధ్యాయునిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, అతనిపై ఎలాంటి చట్టపరమైన చర్యను తాము కోరుకోవడం లేదని అందులో బాలిక తల్లిదండ్రులు రాసిచ్చారు. దీనిని పోలీసులు కోర్టులో సమర్పించగా, కింది కోర్టు దానిని తిరస్కరించింది. నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం దానిని అంగీకరిస్తూ, అతనిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆదేశించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త రామ్‌జీ లాల్ బైర్వా సుప్రీంను ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. బాధితులతో రాజీ పడినంత మాత్రాన అతను చేసిన నేరం రద్దయిపోదని పేర్కొంటూ నిందితుడిపై తిరిగి ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ కొనసాగించాలని తన తీర్పులో పేర్కొంది.

కెనడాలో భారత కాన్సులర్
శిబిరాలు రద్దు

టొరంటో, నవంబర్ 7: కెనడాలో నిర్వహించాలనుకున్న కాన్సులర్ శిబిరాలను రద్దు చేస్తున్నట్టు ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. శిబిర నిర్వాహకులకు కనీస భద్రత, రక్షణ కల్పించలేమని కెనడా అధికారులు నిస్సహాయత వ్యక్తం చేయడంతో వీటిని రద్దు చేసినట్టు చెప్పారు. ఈ నెల 3న బ్రాంప్టన్‌లోని హిందూ దేవాలయం, భారత కాన్సులేట్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి కొందరు ఖలిస్థానీ నిరసనకారులు హింసాత్మక చర్యలతో అంతరాయం కలిగించిన క్రమంలో కెనడా అధికారులు ఈ ప్రకటన చేయడం గమనార్హం. కాగా, ఖలిస్థానీల నిరసనను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఖండించారు. భారత్ కూడా ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఒక ప్రకటన చేసింది.

'ఏఐ లాయర్'తో సీజేఐ ముచ్చట

- మరణ శిక్ష రాజ్యాంగబద్ధమేనని సీజేఐకు జవాబు
- నేషనల్ జ్యుడీషియల్ మ్యూజియం ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబర్ 7: నేషనల్ జ్యుడీషియల్ మ్యూజియం అండ్ ఆర్కైవ్(ఎన్‌జేఎంఏ)ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గురువారం ప్రారంభించారు. గతంలో మాజీ న్యాయమూర్తుల లైబ్రరీ ఉన్న స్థలంలో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మ్యూజియంలో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ న్యాయవాది(ఏఐ లాయర్)తో జస్టిస్ డీవై చంద్రచూడ్ ముచ్చటించారు. 'భారత్‌లో మరణ శిక్ష రాజ్యాంగబద్ధమేనా?' అని ఏఐ లాయర్‌ను ప్రశ్నించారు. 'అవును. భారత్‌లో మరణశిక్ష రాజ్యాంగబద్ధమే. హేయమైన, అరుదైన నేరాల్లో కోర్టు ఈ శిక్ష విధించొచ్చు' అని ఏఐ సమాధానమిచ్చి న్యాయమూర్తులను ఆశ్చర్యపరిచింది. కాగా, గ్రంథాలయాన్ని మ్యూజియంగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్‌జేఎంఏ ప్రారంభోత్సవాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ బహిష్కరించాయి.

గుజరాత్‌లో జికా వైరస్ కేసు నమోదు

అహ్మదాబాద్, నవంబర్ 7: గుజరాత్‌లోని ఓ వ్యక్తికి జికా వైరస్ సోకిందని ఆ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ఆ వ్యక్తి వైరస్ ప్రభావం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, దీంతో అతడ్ని వారం రోజుల క్రితం దవాఖాన నుంచి ఇంటికి పంపించినట్టు గుజరాత్ ఆరోగ్య శాఖ తాజాగా వెల్లడించింది. అయితే, సదరు రోగి విదేశాలకు వెళ్లలేదని, అతడికి వైరస్ ఎలా సోకిందన్నదానిపై స్పష్టత లేదని అధికారులు చెప్పారు.

ఆన్‌లైన్‌లో నేరగాళ్ల టీ షర్టుల అమ్మకం

పలు సంస్థలపై కేసు నమోదు

ముంబై (నమస్తే తెలంగాణ) : నేరగాళ్ల చిత్రాలున్న టీ-షర్టులను అమ్ముతున్న పలు ఈ-కామర్స్ సంస్థలపై మహారాష్ట్ర సైబర్ పోలీస్ విభాగం కేసులు నమోదు చేసింది. దావూద్ ఇబ్రహీం, లారెన్స్ బిష్ణోయ్ చిత్రాలతో ఉన్న టీ-షర్టులు అమ్ముతున్న ఫ్లిప్‌కార్ట్, అలీ ఎక్స్‌ప్రెస్, టీ షాపర్ సంస్థలపై కేసులు నమోదయ్యాయి. క్రిమినల్స్‌ను హీరోలుగా చూపెట్టే చర్యలు యువతపై తీవ్ర చెడు ప్రభావాన్ని కలిగిస్తాయని ఒక పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

పంట వ్యర్థాలు తగులపెడితే
జరిమానా రెట్టింపు
ఢిల్లీలో కాలుష్యం నేపథ్యంలో కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రంగా పతనమవుతుండటంతో కేంద్రం కఠిన చర్యలు ప్రారంభించింది. సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పంట వ్యర్థాలు తగులబెట్టినవారికి విధించే జరిమానాను రెట్టింపు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, రెండు ఎకరాల కన్నా తక్కువ భూమి గల రైతులపై పర్యావరణ నష్టపరిహారం రూ.5 వేలు విధించవచ్చు. రెండెకరాల నుంచి ఐదు ఎకరాల లోపు భూమి కలవారికి రూ.10 వేలు, ఐదు ఎకరాల కన్నా ఎక్కువ భూమి కలవారికి రూ.30 వేల వరకు విధించవచ్చు.

గాలి, నీరు కలుషితమవడంతో ఇబ్బందులు

ఢిల్లీవాసులు గాలి, నీటి కాలుష్యాలతో సతమతమవుతున్నారు. యమునా నది నీరు విపరీతంగా కలుషితమైంది. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో గురువారం ఉదయం 9 గంటలకు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 367కు చేరింది. కొన్ని ప్రాంతాల్లో ఇది 400కు చేరింది. ఇటీవల కాలుష్యం కారణంగా శ్వాసకోశ వ్యాధులతో దవాఖానలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నదని వైద్యులు తెలిపారు.

స్థలాల కేటాయింపు ఉపసంహరణకు
ముడా నిర్ణయం

న్యాయ కమిషన్ నివేదిక తర్వాత అమలు • స్కామ్ విచారణ వేళ కీలక పరిణామం



మైసూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముడా భూముల కుంభకోణంపై విమర్శలను ఎదుర్కొంటున్న తరుణంలో కీలక పరిణామం జరిగింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) సభ్యులు గురువారం సమావేశమై, 50:50 స్కీమ్‌లో కేటాయించిన భూములను ఉపసంహరించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. జస్టిస్ పీఎన్ దేశాయ్ కమిషన్ రిపోర్టు వచ్చిన తర్వాత దీనిని అమలు చేయాలని నిర్ణయించారు. ముడా చైర్మన్ పదవికి కే మారిగౌడ గత నెల 16న రాజీనామా చేయడంతో డిప్యూటీ కమిషనర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి పార్వతి నుంచి ముడా సేకరించిన భూమికి ప్రత్యామ్నాయంగా 50:50 స్కీమ్ ప్రకారం ఆమెకు తిరిగి ఇచ్చిన స్థలాల విషయంలో ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. చట్టవిరుద్ధంగా కేటాయించిన స్థలాలను ఉపసంహరించనున్నట్లు మైసూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హెచ్‌సీ మహదేవప్ప ఈ నెల 1న సంకేతాలు ఇచ్చారు. ముడా భూముల్లో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న రిటైర్డ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ దేశాయ్ కమిషన్ డిసెంబర్‌లో నివేదిక ఇచ్చే అవకాశముంది.

సిద్ధూకు మరోసారి లోకాయుక్త సమన్లు?

ముడా స్థలాల కేటాయింపులపై దర్యాప్తులో భాగంగా సిద్ధరామయ్యకు లోకాయుక్త పోలీసులు మరోసారి సమన్లు జారీ చేసే అవకాశం ఉందని ఆయన న్యాయ సలహాదారు ఏఎస్ పొన్నన్న చెప్పారు. దర్యాప్తు అధికారులు ఎన్నిసార్లు కావాలనుకుంటే అన్నిసార్లు పిలిచి, ప్రశ్నించవచ్చునని తెలిపారు. సిద్ధూను లోకాయుక్త పోలీసులు బుధవారం ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మరోవైపు సీఎం పదవికి తాను రాజీనామా చేయబోనని సిద్ధరామయ్య మరోసారి తెలిపారు.

నన్ను నాశనం చేయాలనేదే బీజేపీ ప్రయత్నం: సిద్ధరామయ్య

కర్ణాటకలో కాంగ్రెస్‌ను నిర్మూలించాలనే భారీ వ్యూహంతోనే బీజేపీ తనపై దృష్టి పెట్టిందని సిద్ధరామయ్య గురువారం ఆరోపించారు. 'బీజేపీ వాళ్లు ఐటీ, ఈడీని దుర్వినియోగం చేసి నాపై, నాగేంద్రపై తప్పుడు కేసులు పెట్టించారు. బీజేపీని విమర్శించే వారిని నిర్మూలించేందుకు ఆ పార్టీ ఎంత దూరమైనా వెళ్తుంది. మోదీ, అమిత్ షాను విమర్శిస్తున్నందుకే నన్ను నాశనం చేయాలనుకుంటున్నారు. సిద్ధరామయ్యను అంతం చేస్తే కర్ణాటకలో కాంగ్రెస్‌ను అంతం చేయొచ్చనేది వారి ఆలోచన.' అని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

ఈ-కామర్స్ విక్రేతలపై
ఈడీ దాడులు
ఎఫ్‌డీఐ నిబంధనల ఉల్లంఘనే కారణం!

న్యూఢిల్లీ, నవంబర్ 7: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ వేదికల ద్వారా విక్రయాలు జరుపుతున్న కొందరు వ్యాపారుల దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు చేసింది. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, గురుగ్రామ్, బెంగళూరు, పంచకులలోని 19 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. వీరు ఈ-కామర్స్ ద్వారా జరుపుతున్న విక్రయాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలతో ఈడీ ఈ దాడులు చేపట్టింది. ఈ-కామర్స్ సైట్లలో పలువురు విక్రయదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వస్తువుల ధరలను ప్రభావితం చేస్తున్నారని, ఇది ఇతర విక్రేతలకు నష్టంగా మారుతున్నదని ఈడీకి అనేక ఫిర్యాదులు అందాయి. దీంతో ఫెమా చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నది. మరోవైపు వ్యాపారాల్లో పారదర్శకమైన పోటీ ఉండేలా చూసే కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కూడా ఈ వ్యవహారంపై ఆరా తీస్తున్నది.

బినామీ బ్యాంకు ఖాతాల్లో
125 కోట్లు జమ
ఎన్నికల వేళ మహారాష్ట్రలో అక్రమ లావాదేవీలు

ముంబై, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికల వేళ నాసిక్ జిల్లాలో కోట్లాది రూపాయల అక్రమ లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. మాలెగావ్ ప్రాంతానికి చెందిన 12 మంది యువకులను యాజమానులుగా చూపుతూ నాసిక్ మర్చంట్ బ్యాంక్ మాలెగావ్ బ్రాంచ్‌లో వివిధ సంస్థల పేర్ల మీద బినామీ బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఒక్కో ఖాతాలో రూ.10 కోట్లు, రూ.15 కోట్ల చెప్పున మొత్తం రూ.125 కోట్లు జమయ్యాయి. ఈ విషయం సదరు యువకులకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజుల క్రితం ఉద్యోగాల పేరుతో సిరాజ్ అహ్మద్ అలియాస్ ఇస్మా అనే వ్యక్తి తమ ఆధార్ కార్డు, పాన్ కార్డు, సంతకాలు తీసుకున్నాడని యువకులు తెలిపారు. దీంతో పోలీసులు సిరాజ్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో అది హవాలా సొమ్ము అయి ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికార మార్పిడికి సహకరిస్తా

మద్దతుదారులతో కమలా హారిస్

వాషింగ్టన్, నవంబర్ 7: అమెరికాలో శాంతియుతంగా అధికార మార్పిడి జరిగేందుకు సహకరిస్తామని అధ్యక్ష ఎన్నికల్లో ఓడిన డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ పేర్కొన్నారు. ఆమె హోవర్డ్ యూనివర్సిటీలో తన మద్దతుదారులతో మాట్లాడుతూ.. భావోద్వేగానికి గురయ్యారు. ఎన్నికల ఫలితాలను ఆమోదించాలని ఆమె కోరారు. తన మనసు సంతోషంతో నిండి ఉన్నదని అన్నారు. తనపై చూపిన నమ్మకానికి కృతజ్ఞతతో ఉంటానని, దేశ ఆదర్శాలను రక్షించేందుకు పోరాడతానని పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడానని, శుభాకాంక్షలు చెప్పానని తెలిపారు.

ట్రంప్ ఇంట్లో సంబరాలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో క్లబ్‌లో ఆయన ఎలక్షన్ నైట్ పార్టీ ఇచ్చారు. ట్రంప్ కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రంప్ ప్రచారంలో కీలకంగా వ్యవహరించిన టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కూడా ఈ పార్టీలో పాల్గొన్నారు. ఈ ఫోటోను ట్రంప్ మనవరాలు కై ట్రంప్ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

ట్రంప్ కార్యవర్గంలోకి మనోళ్లు?

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ తన కార్యవర్గంలో పలువురు భారత సంతతి అమెరికన్లకు చోటు కల్పించే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. వివేక్ రామస్వామికి ట్రంప్ కార్యవర్గంలో కీలక స్థానం దక్కవచ్చు. ఇక, అమెరికా నిఘా సంస్థ సీఐఏ అధిపతిగా భారతీయ మూలాలు ఉన్న కశ్యప్ పటేల్‌ను నియమిస్తారనే ప్రచారం జరుగుతున్నది. భారత సంతతి వ్యక్తి బాబీ జిందాల్‌కు ట్రంప్ కార్యవర్గంలో హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ సెక్రటరీగా చోటు దక్కే అవకాశం ఉంది. నిక్కీ హేలీకి సైతం ట్రంప్ కార్యవర్గంలో చోటు దక్కే అవకాశం ఉంది.

తప్పులను సరిదిద్దుకునేందుకు ఇది అవకాశం: ఇరాన్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయంపై ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో చేసిన తప్పులను సమీక్షించుకునేందుకు అమెరికాకు ఇది అవకాశమని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలతో తమకు ఒరిగేదేమీ లేదని, అధ్యక్షులు మారినంత మాత్రాన విధానాలు మారవని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ అధికార ప్రతినిధి ఫతేమే మొహజెరానీ పేర్కొన్నారు.

కాలిఫోర్నియాలో భారీ కార్చిచ్చు
10 వేల మంది తరలింపు

వాషింగ్టన్, నవంబర్ 7: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రాన్ని భీకరమైన కార్చిచ్చు చుట్టుముట్టింది. వేలాది ఇండ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. కేవలం ఐదు గంటల వ్యవధిలో మంటలు 62 కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించటంతో భయాందోళన నెలకొన్నది. అధికారులు లాస్ ఏంజెల్స్ సమీప ప్రాంతాల్లోని 10 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సబర్బన్ కమ్యూనిటీల్లో, వ్యవసాయ ప్రాంతాల్లో దాదాపు 3,500 భవనాలకు ప్రమాదం పొంచి ఉందని కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ హెచ్చరికలు జారీ చేశారు. లాస్ ఏంజెల్స్‌లో దట్టమైన పొగ ఆకాశంలో వందల అడుగుల ఎత్తులో విస్తరించింది. నగరం చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ ఈ పొగ కమ్మేసింది.

మస్క్ ప్రభావం మస్తు

- డొనాల్డ్ ట్రంప్ విజయంలో టెస్లా అధినేత కీలక పాత్ర
- ఆర్థిక సాయం.. 'ఎక్స్'లో విస్తృత ప్రచారం
- బైడెన్‌తో చెడటంతో రిపబ్లికన్లకు మద్దతు

ఎన్నికల ఫలితాల వేళ విందులో ట్రంప్, మస్క్

న్యూయార్క్: అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. ఆయన గెలుపునకు అనేక అంశాలు దోహదపడినా అందులో ప్రపంచ కుబేరుడు, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ పాత్ర గణనీయమైనదని చెప్పక తప్పదు. 'ఒక నక్షత్రం పుట్టింది.. అదే ఎలాన్' అని ట్రంప్ తన ఎన్నికల ప్రసంగంలో మస్క్‌ను ప్రశంసలతో ముంచెత్తాడంటే ఆయనకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. ట్రంప్ విజయంలో ఎలాన్ ప్రముఖ పాత్ర పోషించారు. కేవలం ఆర్థికపరంగానే కాక, ట్రంప్‌కు ఒక స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. తన సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ట్రంప్‌కు విస్తృత ప్రచారం కల్పించారు. ఆయన ప్రచారం ఎంత తారస్థాయికి చేరిందంటే ట్రంప్ అధ్యక్షుడు కాకపోతే అమెరికా నాశనం అయిపోతుందన్నట్టుగా ప్రజల మనస్సులను ప్రభావితం చేశారు. ట్రంప్‌తోనే అమెరికాకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రచారం చేశారు. దానిని ప్రజలు కూడా నమ్మారు.

విమర్శలు చేసిన నోటితోనే పొగడ్తలు

ఇప్పుడు కరడు గట్టిన రిపబ్లికన్‌గా వ్యవహరిస్తున్న ఎలాన్ మస్క్ గతంలో ట్రంప్ ప్రత్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేశారు. 2016లో హిల్లరీ క్లింటన్‌కు, 2020 ఎన్నికల్లో బైడెన్‌కు మస్క్ మద్దతు ఇచ్చారు. అయితే 2020లో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన విధానాలు, పాలనా తీరును మస్క్ విమర్శించడం ప్రారంభించారు. దీంతో 2021 నుంచి ఇద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. శ్వేత సౌధంలో జరిగిన శిఖరాగ్ర సమావేశానికి తన కంపెనీ టెస్లాకు బైడెన్ ఆహ్వానం పంపలేదని మస్క్ ఆరోపించారు. అలాగే కార్మిక సంఘాలకు జో బైడెన్ మద్దతు ఇవ్వడాన్ని మస్క్ తప్పుబట్టారు. దీంతో 2022లో డెమొక్రటిక్‌ను విభజన, ద్వేషపూరిత పార్టీగా ముద్ర వేస్తూ తాను ఆ పార్టీని వీడి రిపబ్లికన్ వైపు వెళ్తున్నట్టు ప్రకటించారు.

'370'పై జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో రగడ
ఎమ్మెల్యేల తోపులాటతో సభ వాయిదా

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌కు గతంలో ఇచ్చిన ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ శాసన సభ బుధవారం చేసిన తీర్మానంపై బీజేపీ ఎమ్మెల్యేలు వరుసగా రెండో రోజు గురువారం సభలో తీవ్ర నిరసన తెలిపారు. మరోవైపు, ప్రతిపక్ష పీడీపీ, పీపుల్స్ కాన్ఫరెన్స్ సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానంలో అధికరణలు 370, 35ఏలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యే, శాసన సభలో ప్రతిపక్ష నేత సునీల్ శర్మ సభలో మాట్లాడుతున్న సమయం లో అవామీ ఇత్తెహాద్ పార్టీ ఎమ్మెల్యే షేక్ ఖుర్షీద్ వెల్‌లోకి ప్రవేశించి, అధికరణలు 370, 35ఏలను తక్షణమే పునరుద్ధరించాలని బ్యానర్‌ను ప్రదర్శించారు. బీజేపీ ఎమ్మెల్యేలు వెల్‌లోకి ప్రవేశించి, ఆ బ్యానర్‌ను చింపేశారు. దీంతో ఖుర్షీద్, బీజేపీ ఎమ్మెల్యేల మధ్య స్వల్ప ఘర్షణ, తోపులాట జరిగింది.ఈ సందర్భంగా మార్షల్స్, బీజేపీ ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో స్పీకర్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఎడారిపై మంచు దుప్పటి
సౌదీ అరేబియా చరిత్రలో తొలిసారి

రియాద్: ఇసుక మేటలతో నిండి ఉండే సౌదీ అరేబియా ఎడారిలో చరిత్రలో తొలిసారిగా రికార్డు స్థాయిలో హిమపాతం నమోదైంది. అల్-జాఫ్ ప్రాంతంలో ఎక్కడ చూసినా ఇసుకతో దర్శనమిచ్చే ఆ ఎడారి ప్రాంతం ఇప్పుడు మంచు దుప్పటి కప్పుకుని అంటార్కిటికాను గుర్తు చేస్తూ శీతాకాలపు వింత భూమిగా మారిపోయింది. ఇటీవల వచ్చిన భారీ తుఫాన్‌లు, భారీ వర్షాల కారణంగానే ఈ రీజియన్‌లో తీవ్రంగా హిమపాతం కురిసిందని, దీంతో కొండలు, ఎడారి ప్రాంతాల్లో మంచు పరుచుకుందని ఖలీజ్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. రానున్న రోజుల్లో వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సౌదీ అరేబియా వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. బలమైన గాలులతో భారీ వర్షపాతం నమోదు కావచ్చునని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది.

బీరుట్‌పై భీకర దాడులు

లెబనాన్‌లో 30 మృత దేహాలు వెలికితీత
ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల ప్రయోగం

బార్జా పట్టణంలో దెబ్బతిన్న ఇండ్లు

జెరూసలేం, నవంబర్ 7: ఇజ్రాయెల్ మిలటరీ, హెజ్బొల్లా బలగాల మధ్య పోరు భీకర రూపం దాల్చింది. లెబనాన్‌లోని పలు స్థావరాల్ని ఇజ్రాయెల్ సైన్యం టార్గెట్ చేయగా, హెజ్బొల్లా బలగాలు ఇజ్రాయెల్‌లోని ఉత్తర, మధ్య ప్రాంతాలపై రాకెట్ దాడులకు దిగింది. హెజ్బొల్లా రాకెట్ దాడుల్లో అనేక ఇండ్లు ధ్వంసమయ్యాయని, అనేక మంది తీవ్రంగా గాయపడగా వారిని దవాఖానలకు తరలించామని ఇజ్రాయెల్ మిలటరీ అధికారులు గురువారం చెప్పారు. మరోవైపు లెబనాన్ రాజధాని బీరుట్ సహా వివిధ ప్రాంతాలపై భీకరమైన దాడులతో ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. బీరుట్ శివారు ప్రాంతాలపై వైమానిక దాడుల్ని ఉధృతం చేసింది. లెబనాన్‌లోని ఏకైక అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని ఓ ప్రాంతంపైనా వైమానిక దాడులు జరిపింది. మంగళవారం రాత్రి మధ్య లెబనాన్‌లోని బార్జా పట్టణంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరపగా, 30 మృతదేహాల్ని వెలికితీసినట్టు లెబనాన్ రెస్క్యూ సిబ్బంది తెలిపారు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులు చేసిందని లెబనాన్ ఆరోపించింది. తాము ముందుగానే నోటీసులు ఇచ్చామని, హెజ్బొల్లా స్థావరాలనే తాము లక్ష్యంగా చేసుకున్నామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. బీట్ లాహియా లో గ్రౌండ్ ఆపరేషన్ చేపడుతున్నట్టు పేర్కొన్నది.

పాలస్తీనా పౌరులపై వేటుకు చట్టం

ఇజ్రాయెల్ ఆక్రమిత పాలస్తీనాలో అక్కడి పౌరులు, ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడ్డవారి కుటుంబ సభ్యులపై బహిష్కరణ వేటు వేసేందుకు నెతన్యాహూ ప్రభుత్వం వివాదాస్పద చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టాన్ని ఇజ్రాయెల్ పార్లమెంట్ గురువారం ఆమోదించింది.

పోర్న్ వీక్షణలో కిమ్ సైనికులు బిజీ!
రష్యాలో అపరిమిత ఇంటర్నెట్‌తో విచ్చలవిడితనం

న్యూఢిల్లీ, నవంబర్ 7: అప్పటివరకు ఇంటర్నెట్ వాడకంపై ఆంక్షలతో అరకొరగా దానిని వాడిన ఉత్తర కొరియా సైనికులు రష్యాలో అడుగుపెట్టగానే ఒక్కసారి జూలు విదిల్చారు. అక్కడ అపరిమితంగా లభిస్తున్న ఇంటర్నెట్ వల్ల అశ్లీల చిత్రాలు చూడటంలో నిమగ్నమయ్యారు. ఈ విషయాన్ని బ్రిటన్ వార్తా సంస్థ ది ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కోసం ఉత్తర కొరియా తమ దేశానికి చెందిన వందలాది మంది సైనికులను రష్యాకు పంపింది.

క్యాన్సర్‌కు కొత్త చికిత్స

బలహీన డీఎన్ఏ లక్ష్యంగా విధానం



న్యూఢిల్లీ: అత్యంత తీవ్ర రూపాల్లోని క్యాన్సర్‌కు కొత్త చికిత్సా విధానాన్ని అమెరికా, బ్రిటన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. 'నేచర్ జెనెటిక్స్' జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయన నివేదిక ప్రకారం.. బ్రిటన్‌లోని దాదాపు 15 వేల మంది క్యాన్సర్ రోగుల సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. వీరిలో 39 రకాల కణుతులు గలవారు ఉన్నారు. వీరిలో 16 శాతం మందికిపైగా ఎక్స్‌ట్రా క్రోమోజోమల్ డీఎన్ఏ (ఈసీడీఎన్ఏ) కలవారు ఉన్నారు. కణితి (ట్యూమర్) పెరుగుదలను ప్రేరేపించే, కీమో థెరపీని నిరోధించే బలహీనమైన, అస్థిరమైన డీఎన్ఏను లక్ష్యంగా చేసుకుని చికిత్స చేసే విధానాన్ని గుర్తించారు. చికిత్స చేయడం సంక్లిష్టమైన క్యాన్సర్లలో ఈసీడీఎన్ఏ, కొద్దిగా జెనెటిక్ మెటీరియల్ ఉంటాయని కనుగొన్నారు. ఈ ఈసీడీఎన్ఏను అరికట్టగలిగే ఔషధాన్ని కూడా ఈ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ మందుపై క్లినికల్ ట్రయల్స్ ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నాయి. ఈ ఔషధం ఈసీడీఎన్ఏతో కూడిన క్యాన్సర్ సెల్స్‌ను ఎంపిక చేసి మరీ తుదముట్టించగలదు. ఫలితంగా వీటిలో ఔషధాలను తట్టుకోగలిగే సామర్థ్యం వేగంగా వృద్ధి చెందకుండా నిరోధిస్తుంది. అనేక రకాల క్యాన్సర్లకు ట్యాక్సోల్ బేస్డ్ థెరపీస్ చేస్తారు. డొసెటాక్సెల్, పక్లిటాక్సెల్ వంటి థెరపీలు చేస్తారు. ఈ చికిత్సల తర్వాత ఈసీడీఎన్ఏ తరచూ కనిపిస్తున్నట్లు ఈ అధ్యయనం గుర్తించిందని యేల్ విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ అధ్యయన నివేదిక రచయితల్లో ఒకరైన వెర్హాక్ మాట్లాడుతూ, ఈసీడీఎన్ఏ ఉన్న ట్యూమర్లలోని బలహీనతలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈసీడీఎన్ఏ లక్ష్యంగా జరిగే చికిత్సల వల్ల క్యాన్సర్ రోగుల్లో మూడో వంతు మంది ప్రయోజనం పొందే అవకాశం ఉందని తెలిపారు.